సాక్షి
ఖమ్మం

గురువారం । 3 । ఏప్రిల్ । 2025



ప్రజల్లోకి.. జై సంవిధాన్

రాజ్యాంగంపై బీజేపీ వ్యవహరిస్తున్న తీరును ప్రజలకు వివరించాలని సంవిధాన్ కో ఆర్డినేటర్ మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. 8లో



పరీక్షలు ముగిసాయోచ్!

పదో తరగతి పరీక్షలు ముగియగా విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఆపై స్నేహితుల వద్ద వీడ్కోలు తీసుకుని ఇళ్లకు బయలుదేరారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 37° / 24°

జిల్లాలో ఉదయం, సాయంత్రం సాధారణ వాతావరణమే ఉంటుంది. మధ్యాహ్నం మాత్రం ఎండ కాస్త ఎక్కువగా నమోదవుతుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10–30గంటలకు కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలోని గంగమ్మతల్లి ఆలయంలో పూజలు చేయనున్న మంత్రి, ఆతర్వాత ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారు. అనంతరం జుజ్జుల్‌రావుపేట, తుమ్మలతండా, ధర్మాతండా మీదుగా మధ్యాహ్నం ఒంటి గంటకు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి మద్దులపల్లికి చేరుకుని సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత వరంగల్ క్రాస్‌రోడ్డులో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, గూడూరుపాడు–గోళ్లపాడు ఊటవాగు తండాకు బీటీ రోడ్డు, కస్నాతండాలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశాక కాచిరాజుగూడెం మీదుగా ఖమ్మం చేరుకుంటారు.

మంత్రి తుమ్మల...

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఖమ్మంలో పర్యటిస్తారు. ఖమ్మం 44డివిజన్ శ్రీరాంనగర్‌లో రైతుబజార్‌ను ప్రారంభించనున్న మంత్రి, ఆతర్వాత మరికొన్ని కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ప్రయాణికులు, సిబ్బందికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఆర్‌ఎం, ఉద్యోగులు

కల్లూరు: ఎండల కారణంగా ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది వడదెబ్బకు గురికాకుండా కల్లూరు కొత్త బస్టాండ్‌లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీని ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ ఎండల నుంచి ఉపశమనం కలిగించేలా ఏటా మాదిరిగానే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కాగా, మూడు నెలలుగా దాతల సాయంతో మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఆ తర్వాత ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కండక్టర్ వీఎస్‌ఆర్.ప్రసాద్ కుటుంబాన్ని రీజినల్ మేనేజర్ సరిరామ్ పరామర్శించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబీకులతో మాట్లాడారు. సంస్థ తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈకార్యక్రమాల్లో సత్తుపల్లి, ఖమ్మం డిపో మేనేజర్లు యు.రాజ్యలక్ష్మి, దినేష్‌కుమార్, కల్లూరు మెడికల్ ఆఫీసర్ నవ్యకాంత్, వీబీట కిన్నెర ఆనందరావు, కంట్రోలర్ యంగళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఉపాధ్యాయులకు శిక్షణ

నేలకొండపల్లి: గత ఏడాది జూన్‌లో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు బోధనా నైపుణ్యాల పెంపుదల, పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా గురు, శుక్రవారాల్లో శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 1,087 మంది పీజీ హెచ్‌ఎం, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలుగా, స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. వీరిని కేటగిరీల వారీగా విభజించి ఏడు కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు. ఖమ్మం రోటరీనగర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌తో పాటు ఎన్నెస్పీ కాలనీ, రాజేంద్రనగర్, రిక్కాబజార్, శాంతినగర్, ఇందిరానగర్, ఖాజీపుర జీహెచ్‌ఎస్‌ల్లో శిక్షణకు అధికారులు నిర్ణయించారు.

జేఈఈ మెయిన్స్ ప్రారంభం




విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో జేఈఈ మెయిన్స్ రెండో పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఖమ్మంలోని విజయ, శ్రీచైతన్య, బొమ్మ, ఎస్‌బీఐటీ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేయగా రెండు సెషన్లలో పరీక్ష నిర్వహించారు. ఉదయం పరీక్షకు 498మందిలో 454 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 534మందికి గాను 490మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఎరువుల దుకాణాల్లో డీఏఓ తనిఖీ

ఖమ్మంరూరల్: రూరల్ మండలంలోని తల్లంపాడు, ముత్తగూడెం, నాయుడుపేట, ఆరేకోడులోఎరువులు, పురుగు మందుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా షాపుల్లో నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించిన ఆయన ప్రతీ అమ్మకంపై బిల్లు ఇవ్వాలని, స్టాక్ వివరాలతో రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. డీలర్లు అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఏఓ ఉమానగేష్ తదితరులు పాల్గొన్నారు.

గల్లాపెట్టె గలగల..!



ఉమ్మడి జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఈ ఏడాది గణనీయమైన ఆదాయం సమకూరింది. ఉమ్మడి జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 2024 – 25 ఏడాదిలో 45,783 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.206.25 కోట్లు వచ్చాయి. 2023 – 24తో పోలిస్తే ఇది రూ.8 కోట్లు అదనమే అయినా.. 2022 – 23తో పోలిస్తే మాత్రం కాస్త తగ్గుముఖం పట్టింది. ఇక గత ఆర్థిక సంవత్సరం కంటే తాజాగా ముగిసిన సంవత్సరంలో డాక్యుమెంట్లు పెరగడంతో అదేస్థాయిలో ఆదాయం నమోదైంది. 2024 – 25లో రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత మూడు జిల్లాల్లోనే రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం పెరగ్గా.. అందులో ఉమ్మడి ఖమ్మం జిల్లా కూడా ఉంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు పెరిగిన ఆదాయం

- గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.206.25 కోట్ల రాబడి
- ఉమ్మడి జిల్లాలో 45.783 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్
- గత ఏడాదితో పోలిస్తే రూ.8 కోట్లు అధనం

2020-21 నుంచి డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్, ఆదాయం ఇలా..

ఏడాది	డాక్యుమెంట్లు	ఆదాయం (రూ.ల్లో)
2020-21	50,276	100,05,20,114
2021-22	57,570	206,68,18,974
2022-23	47,102	227,34,80,000
2023-24	44,201	198,21,00,000
2024-25	45,783	206,25,00,000



11 కార్యాలయాలు..

ఉమ్మడి జిల్లాలో ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌తోపాటు ఖమ్మంరూరల్, కూసుమంచి, మధిర, సత్తుపల్లి, వైరా, కల్లూరు, కొత్తగూడెం, భద్రాచలం, బూర్గంపాడు, ఇల్లెందు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 45,783 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయగా రూ.206.25 కోట్ల ఆదాయం వచ్చింది. స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో ఈ ఆదాయం నమోదైంది. 2023–24లో 44, 201 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ ద్వారా రూ.198.21 కోట్ల ఆదాయం సమకూరింది.

తగ్గిన రియల్ బూమ్..

హైదరాబాద్, వరంగల్ వంటి నగరాల తర్వాత ఖమ్మంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగేది. కానీ కొద్ది నెలలుగా ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిపోయింది. ఖమ్మం చుట్టుపక్కల, రూరల్ ప్రాంతాల్లో కొద్దో గొప్ప వ్యాపారం నడుస్తున్నా.. జిల్లా కేంద్రంలో మాత్రం నామమాత్రమైంది. భూముల క్రయవిక్రయాలు లేకపోవడంతో రిజిస్ట్రేషన్లూ జరగలేదు. రెండేళ్ల క్రితం 50వేలకు పైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగితే, గతేడాది నుంచి 50 వేల లోపే అవుతుండడం గమనార్హం. అయితే ఖమ్మంలో ప్రధాన రహదారుల వెంట ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం కొంత ఆశాజనకంగా ఉన్నట్లు తెలుస్తోంది. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పూర్తయితే మళ్లీ వ్యాపారం ఊపందుకుంటుందని, తద్వారా రిజిస్ట్రేషన్లు పెరుగుతాయని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

రూ.250 కోట్ల లక్ష్యం

ప్రభుత్వం ఈ ఏడాది (2025–26) స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా భారీగా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రణాళికలు చేస్తోంది. జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్దేశించి ఆ మేరకు ఆదాయం వచ్చేలా నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లా నుంచి 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.250 కోట్లకు పైగా ఆదాయం వచ్చేలా లక్ష్యాలను నిర్దేశించనున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి త్వరలోనే జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు ఆదేశాలు అందనున్నట్లు తెలిసింది.

రాజీవ్ యువ వికాసంతో యువతకు ఉపాధి



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన అదనపు కలెక్టర్లు, అధికారులు

- బ్యాంక్ లింకేజీ రుణాల మంజూరుపై దృష్టి
- అన్ని రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీ
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగపడనున్నందున యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 14వ తేదీ వరకు వరకు రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఆన్‌లైన్‌లో లేదా ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ పథకం ద్వారా రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు సబ్సిడీ యూనిట్లు మంజూరవుతాయని, వ్యవసాయేతర యూనిట్లకు 21–55 ఏళ్లు, వ్యవసాయ యూనిట్లకు 60 ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ లేదా ఆధాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందని చెప్పారు. పత్రాల అభ్యర్థులకు అవసరమైన సర్టిఫికెట్లు మూడు రోజుల్లో జారీ చేసేలా తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. మండల, గ్రామ జనాభాకు అనుగుణంగా కేటాయించిన లక్ష్యాల ప్రకారం యూనిట్ల మంజూరు ఉంటుందని, పత్రాల కారణంగా మంజూరు ఆపబోమని తెలిపారు. స్క్రూటినీని ప్రత్యేక అధికారులు పర్యవేక్షించనుండగా.. యూనిట్ల ఆధారంగా అభ్యర్థులకు అవసరమైన శిక్షణ కూడా ఇప్పిస్తామని కలెక్టర్ వెల్లడించారు. అర్హులందరికీ బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సరిగా పనిచేయని డీలర్లపై చర్యలు

జిల్లాలోని అన్ని రేషన్‌షాపల ద్వారా లబ్ధిదారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వెల్లడించారు. ఇదేసమయాన డీలర్ల యాజమాన్య వివరాలను తనిఖీ చేస్తూ, సరిగ్గా పని చేయని వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. అలాగే, రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో డీఆర్డీఓ సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ నవీన్‌బాబు, బీసీ, గిరిజన, మైనార్టీ సంక్షేమ అధికారులు జి.జ్యోతి, ఎన్.విజయలక్ష్మి, డాక్టర్ బి.పురంధర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జి.శ్రీలత పాల్గొన్నారు.

మరో 28 రోజులు ఎల్‌ఆర్‘ఎస్’

- ఈనెల 30 వరకు గడువు పెంచిన ప్రభుత్వం
- జిల్లాలో ఇప్పటివరకు రూ.66.32 కోట్ల ఆదాయం



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఎల్‌ఆర్‌ఎస్(లే ఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) ద్వారా స్థలాల క్రమబద్ధీకరణకు ఫీజులో 25శాతం రాయితీ ప్రకటించిన ప్రభుత్వం ఈ గడువును మరికొద్ది రోజులు పొడిగించింది. ఏళ్లుగా పెండింగ్ ఉన్న దరఖాస్తులను పరిష్కరించేలా ప్రభుత్వం ఫిబ్రవరి 20న రాయితీ ప్రకటించింది. గత నెల 31వ తేదీతో గడువు ముగియగా ఆశించిన స్థాయిలో స్పందన రాని కారణంగా గడువు పెంచింది.

ఖమ్మంకు రాష్ట్రంలో రెండో స్థానం..

రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్లలో దరఖాస్తుల పరిశీలన, అనుమతి, ఫీజు చెల్లింపుల్లో వరంగల్ తర్వాత ఖమ్మం కార్పొరేషన్ రెండో స్థానంలో నిలిచింది. కేఎంసీ పరిధిలో 40,182 దరఖాస్తులు రాగా.. 28,783 మంది ఫీజు చెల్లించేందుకు అనుమతి లభించింది. ఇందులో 7,071 మంది ఫీజు చెల్లించారు. 25శాతం రాయితీ అమల్లోకి వచ్చిన నాటినుంచి ఫ్లెక్సీలు, ఇతర మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయడంతో లబ్ధిదారులు ఫీజు చెల్లించేందుకు ముందుకొచ్చినా మార్చి నెలాఖరులో కొన్ని సమస్యల కారణంగా ఇబ్బంది ఏర్పడింది.

మున్సిపాలిటీల్లో నత్తనడకన

కేఎంసీలో ఈ ప్రక్రియ వేగంగానే ఉన్నా, మున్సిపాలిటీల్లో మాత్రం నత్తనడకన కొనసాగుతోంది. సత్తుపల్లి, మధిర, వైరా, ఏదులాపురం మున్సిపాలిటీల్లో ఫీజు చెల్లించేందుకు పలువురు ఇంకా ముందుకు రావడం లేదు. ఈ మున్సిపాలిటీల్లో 25,002 దరఖాస్తులకు గాను 19,443 దరఖాస్తులకు అనుమతి జారీ చేసి లబ్ధిదారులకు సమాచారం ఇచ్చారు. కానీ ఇందులో కేవలం 3,220 మందే ఫీజు చెల్లించడం గమనార్హం. ప్రస్తుతం గడువు పెంచిన నేపథ్యాన మున్సిపాలిటీల్లో ఎక్కువ మంది ఫీజు చెల్లించేలా అవగాహన కల్పించాల్సిన అవసరముంది. లబ్ధిదారులు కూడా ముందుకొస్తే వారి స్థలాలపై చట్టబద్ధమైన హక్కులు దక్కనున్నాయి.

కార్పొరేషన్‌దే సింహభాగం

ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్ ద్వారా నమోదైన ఆదాయంలో అత్యధిక భాగం ఖమ్మం కార్పొరేషన్ నుంచే వచ్చింది. ఖమ్మం కార్పొరేషన్, సుడా, సత్తుపల్లి, మధిర, వైరా, ఏదులాపురం మున్సిపాలిటీల్లో కలిపి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుల రూపంలో ప్రభుత్వానికి రూ.66.32 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో రూ.39.93 కోట్లు కేఎంసీ పరిధి నుంచే రావడం విశేషం. ఖమ్మం కార్పొరేషన్లలో స్థలాలు ఉండి క్రయవిక్రయాలకు ఇబ్బంది ఎదురవుతుండడంతో ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్ వైపు మొగ్గు చూపారు. కాగా, వైరా మున్సిపాలిటీలో రూ.1.58 కోట్లు, మధిర మున్సిపాలిటీలో రూ.3.2 కోట్లు, ఏదులాపురంలో రూ.7.25 కోట్లు, సత్తుపల్లి మున్సిపాలిటీలో రూ.2.39 కోట్లు ఆదాయం రాగా, సుడా పరిధిలో రూ.11.97 కోట్లు లభించాయి.

గత నెల 31 వరకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలు

మున్సిపాలిటీ	దరఖాస్తులు	ఫీజు అనుమతి	చెల్లించింది
ఖమ్మం	40,182	28,783	7,071
వైరా	3,529	3,125	400
మధిర	4,287	3,744	602
ఏదులాపురం	13,496	9,459	1,726
సత్తుపల్లి	3,690	3,115	492
సుడా	21,021	19,482	4,664

ముందుకొస్తే.. రాయితీ

- ఈ నెల 30లోగా ఆస్తి పన్ను కడితే ఐదు శాతం రిబేట్
- కేఎంసీ, మున్సిపాలిటీల్లో పన్ను చెల్లింపుదారులకు అవకాశం



ఖమ్మంమయూరిసెంటర్: పుర, నగర పాలక సంస్థలకు నిధుల లేమి నుండి ఊరట లభించేలా రాష్ట్ర ప్రభుత్వం ఏటా మాదిరిగానే ఎర్లీ బర్డ్ పథకాన్ని ప్రకటించింది. ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లిస్తే ఈ పథకం ద్వారా ఐదు శాతం రాయితీ లభిస్తుంది. దీంతో ఆర్థిక సంవత్సరం మొదటి నెలలోనే ఎక్కువ మొత్తంలో ఇంటి పన్నులు వసూలు చేసేలా ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని తొమ్మిది మున్సిపాలిటీల అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 82,148 అసెస్‌మెంట్లు ఉండగా.. 51,771 అసెస్‌మెంట్లకు 5శాతం రాయితీ దక్కనుంది. దీంతో వీరందరూ ఈ నెలలోనే పన్ను చెల్లించేలా అవగాహన కల్పించనున్నారు.

ఈనెలాఖరు వరకు రాయితీ..

ఉమ్మడి జిల్లాలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మధిర, వైరా, సత్తుపల్లి, ఏదులాపురం, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఆస్తిపన్ను ఈనెలలో చెల్లిస్తే ప్రభుత్వం ఇచ్చే ఐదు శాతం రాయితీ అమలవుతుంది. 2024–25 ఏడాది వరకు పూర్తిగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి మాత్రమే పన్ను రాయితీ అందుతుందని అధికారులు వెల్లడించారు. ఒకవేళ మార్చి వరకు ఉన్న బకాయిలను జరిమానాతో చెల్లించి, 2025–26 ఏడాదికి సంబంధించిన పన్ను చెల్లించినా ఐదుశాతం రాయితీ వస్తుందని తెలిపారు. ఈమేరకు ఈనెల 30వ తేదీ లోగా సీడీఎంఏ వెబ్‌సైట్ ద్వారా పన్ను చెల్లించాలని సూచించారు.

ఏ.ఐ. బోధన ఎలా అమలవుతోంది?



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఏడీ విజయలక్ష్మి

నేలకొండపల్లి: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విధానంలో బోధన ఎలా సాగుతోందని విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ విజయలక్ష్మిబాయి ఆరా తీశారు. నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెంలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేసిన ఆమె ఏ.ఐ. బోధన అమలు, విద్యార్థులను ప్రగతిని పరిశీలించారు. కంప్యూటర్లపై పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబడుతూ అభినందించారు. కాగా, చదువులో వెనుకబడిన విద్యార్థులు సైతం ముందు వరుసకు చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏడీ సూచించారు. అనంతరం స్థానిక పదో తరగతి పరీక్షల కేంద్రాన్ని పరిశీలించిన ఆమె రామదాసు ధ్యాన మందిరం, బౌద్ధక్షేత్రాన్ని సందర్శించి నేపథ్యాన్ని తెలుసుకున్నారు. ఎంఈఓ బి.చలపతిరావు, సింగారెడ్డిపాలెం హెచ్‌ఎం హరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన ఎర్రబంగారం

- ఖమ్మం మార్కెట్‌కు 70వేలకు పైగా బస్తాల మిర్చి
- ధర పతనంతో రైతుల్లో ఆవేదన

కొద్దినెలలుగా ఖమ్మం మార్కెట్‌లో మిర్చి ధరలు (రూ.ల్లో)

తేదీ	గరిష్టం	మోడల్
డిసెంబర్ 9	16,500	16,000
20	16,000	15,600
జనవరి 17	15,500	15,000
24	15,000	14,800
ఫిబ్రవరి 2	14,200	13,700
24	14,125	13,600
మార్చి 10	14,000	13,300
18	13,700	12,000
19	13,500	11,500
25	13,350	11,000
ఏప్రిల్ 2	13,300	12,000



ఖమ్మం మార్కెట్‌లో మిర్చి బస్తాలు

ఖమ్మంవ్యవసాయం: నాలుగు రోజుల సెలవుల అనంతరం బుధవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో క్రయవిక్రయాలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నలమూలల నుంచే కాక ఇతర జిల్లాల నుంచి సైతం రైతులు మిర్చితో మంగళవారం సాయంత్రం నుంచే రావడం మొదలుపెట్టారు. దీంతో బుధవారం ఉదయంకల్లా 70వేలకు పైగా బస్తాల మిర్చి రావడంతో మార్కెట్ నలుమూలలా ఎర్రబంగారంతో నిండిపోయింది.

పురోగతి లేని ధర

మిర్చి ధర గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది బాగా తగ్గడమే కాక.. కొద్దిరోజులుగా మరింత పతనమవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇరవై రోజుల వ్యవధిలోనే క్వింటాకు రూ.2వేల మేర ధర తగ్గింది. ఓ పక్క విదేశీ ఎగుమతులు లేకపోవడం, మరోవైపు విక్రయాలు పెరగడం ఇందుకు కారణమని విశ్లేషిస్తున్నారు. ఇక్కడ సాగు చేసే తేజా రకం మిర్చిని చైనా దేశానికి ఎగుమతి చేస్తారు. గత ఏడాది ఆర్డర్లు ఉండడంతో క్వింటాకు రూ.20నుంచి రూ.23 వేల మేర ధర పలికింది. ఈసారి చైనాలోనే పంట సాగవడంతో ఆశించిన స్థాయిలో ఆర్డర్లు లేక ధరపై ప్రభావం చూపిస్తోంది. ఈ సీజన్ ఆరంభంలో రూ.16వేల వరకు నమోదైన ధర మార్చి 10వ తేదీ వరకు గరిష్టంగా రూ.14వేలు పలికింది. ఆతర్వాత ఇంకా తగ్గుతూ రూ.13,300కు చేరడం గమనార్హం. అయితే, గరిష్ట ధరతో పొంతన లేకుండా నాణ్యత పేరిట దాదాపు రూ.2వేలకు పైగా తగ్గించి ఎక్కువ సరుకును రూ.11వేల నుంచి రూ.11,500తోనే కొనుగోలు చేస్తున్నారు.

ఏపీ ప్రభావం కూడా..

ఖమ్మం మార్కెట్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట, ఏపీలోని పలు జిల్లాల నుంచి రైతులు మిర్చి తీసుకొస్తున్నారు. సగటున లక్ష బస్తాల వరకు మిర్చి విక్రయానికి వస్తున్న నేపథ్యాన విదేశీ ఆర్డర్లు లేవనే సాకుతో వ్యాపారులు తక్కువ ధర నిర్ణస్తున్నారు. దీనికి తోడు ఏపీ రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వం పీడీపీసీ(ప్రైస్ డిఫరెన్స్ పేమెంట్ స్కీం)ను అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా మిర్చి క్వింటా ధర రూ.11,718గా నిర్ణయించారు. ఏపీ రాష్ట్రం ఖమ్మంకు పొరుగునే ఉండడంతో అక్కడి ధర చెల్లించినా ఇబ్బంది లేదనే భావనతో వ్యాపారులు కాస్త అటూఇటుగా కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది.

ఈ ఏడాది నష్టమే...



ఈ ఏడాది ఎకరాకు శ్రమ కాక రూ.30వేల నుంచి రూ.50వేల వరకు నష్టం వాటిల్లింది. రెండు ఎకరాల్లో మిర్చి సాగుచేయగా, 55 బస్తాలు విక్రయానికి తీసుకువచ్చా. నాణ్యత లేదని క్వింటాకు రూ.12 వేల నుంచి రూ.13 వేలే చెల్లించారు. అయినా అవసరాల రీత్యా అమ్మక తప్పలేదు.

– బ్రహ్మయ్య, చిమ్మపుడి, రఘునాథపాలెం మండలం

ధర బాగా పడిపోతోంది..



వ్యాపారులు చెప్పిన ధరకు అమ్మక తప్పని పరిస్థితి ఉంది. 13 బస్తాల మిర్చి విక్రయానికి తీసుకువచ్చా. రూ.12వేల ధర పెట్టారు. నాణ్యత లేదని మరో ఆరు బస్తాల మిర్చి క్వింటాకు రూ.10వేలే చెల్లించారు. ఈ ధరతో పెట్టుబడులు కూడా పూడవు. నెల క్రితం కన్నా ధర మరింత పడిపోయింది.

– భూక్యా అమ్రు, మరిపెడ, మహబూబాబాద్ జిల్లా

క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కోసం రీచ్‌ల పరిశీలన

బోనకల్: ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేస్తుండడంతో లబ్ధిదారులు ఇసుక కోసం ఇబ్బంది పడకుండా అధికారులు దృష్టి సారించారు. ఈ సందర్భంగా బోనకల్ మండలంలోని వైరా ఏరు పరీవాహక గ్రామాలైన బ్రాహ్మణపల్లి, రాయన్నపేట, కలకోట, మోటమర్రిల్లో రీచ్‌లను మైనింగ్, రెవెన్యూ అధికారులు బుధవారం పరిశీలించారు. రీచ్‌ల్లో నాణ్యతతో పాటు లభ్యతను సర్వేయర్ సమక్షాన పరిశీలించినట్లు మైనింగ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ తెలిపారు. మండలంలోని 22గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన ఇసుక సరఫరాపై దృష్టి సారించినట్లు చెప్పారు. ఆర్ఐ మైథిలి, సర్వేయర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కండక్టర్ నిజాయితీ..



ప్రయాణికుడికి పర్స్ అందజేస్తున్న కండక్టర్, ఉద్యోగులు

మధిర: ప్రయాణికుడు బస్సులో మర్చిపోయిన పర్స్, నగదును ఆయనకు అందజేసిన కండక్టర్ నిజాయితీ చాటుకుంది. మధిర డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు బుధవారం విజయవాడ నుంచి మధిర వస్తోంది. మార్గమధ్యలో దిగిన అల్లూరి వెంకట కృష్ణారావు తన పర్స్ మర్చిపోగా, మధిర వచ్చాక కండక్టర్ ఇ.రాధిక గమనించింది. అందులో రూ.10,500 నగదు, ఇతర కార్డులు ఉండడంతో అందులోని నంబర్ ఆధారంగా వెంకటకృష్ణారావుకు ఫోన్ చేయగా, ఆయన రావడంతో పర్స్ అందజేశారు. దీంతో ఆయన కండక్టర్, డిపో మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఐ నాయకులపై కేసు కొట్టివేత

ఖమ్మం లీగల్: పెట్రోల్ ధరలను అదుపు చేయాలనే డిమాండ్‌తో సీపీఐ ఆధ్వర్యాన చేపట్టిన నిరసనలో పాల్గొన్న నాయకులపై నమోదైన కేసును ఖమ్మం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కొట్టి వేస్తూ బుధవారం తీర్పు వెలువరించింది. 2020 ఫిబ్రవరి 21న పెట్రోల్ ధరలను తగ్గించాలంటూ సీపీఐ నాయకుడు భాగం హేమంతరావు ఆధ్వర్యాన నిరసన తెలపగా అప్పటి జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జానీమియా, పోటు కళావతి, సింగు నరసింహారావు, తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొనగా ఖమ్మం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో భాగంగా సరైన సాక్షాధారాలు లేనందున నాయకులపై కేసు కొట్టివేస్తూ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తీర్పు వెలువరించింది. ముద్దాయిల తరఫున న్యాయవాదులు ఓరుగంటి శేషగిరిరావు, తోట రామాంజనేయులు వాదించారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

తిరుమలాయపాలెం: ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న రెండు డంపర్లతో పాటు రెండు ట్రాక్టర్లను మైనింగ్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. తిరుమలాయపాలెం సమీపాన చేపట్టిన తనిఖీల్లో మట్టి తరలిస్తున్న వాహనాలకు అనుమతి లేదని గుర్తించారు. ఈసందర్భంగా వాహనాలను పోలీసులకు అప్పగించగా సీజ్ చేశారు.

జిల్లాకు ఈదురుగాలులు, వర్ష సూచన

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని వాతావరణంలో బుధవారం సాయంత్రం మార్పులు చోటు చేసుకున్నాయి. ఈనెల 5వ తేదీ వరకు రాష్ట్రంలోని పలుచోట్ల ఈదురుగాలులతో పాటు తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. దీంతో బుధవారం సాయంత్రం ఉష్ణోగ్రతలు కాస్త తగ్గగా.. వాతావరణ కేంద్రం ప్రకటించిన జాబితాలో ఖమ్మం, భద్రాది కొత్తగూడెం జిల్లాలు కూడా ఉన్నాయి. ఉష్ణోగ్రతలు 2నుంచి 4 డిగ్రీల మేర తగ్గే అవకాశముందని వెల్లడించడంతో ఉమ్మడి జిల్లాలో 40 - 41 డిగ్రీల వరకు నమోదవుతున్న ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుముఖం పడతాయని భావిస్తున్నారు. అయితే, యాసంగిలో సాగు చేసిన వరి, మొక్కజొన్న చేతికి వస్తున్న వేళ ఈదురుగాలులు వీస్తాయని, వర్షం కురిసే అవకాశముందన్న సమాచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల వరి, మొక్కజొన్న కోతలు పూర్తిచేసి కల్లాల్లో ఆరబెట్టారు. అలాగే, మిర్చి కోతలు కూడా చివరి దశకు చేరాయి. ఈ సమయంలో వర్షం కురిస్తే నష్టపోయే ప్రమాదమున్నందున పంటల రక్షణలో రైతులు నిమగ్నమయ్యారు. ఇక ఈదురుగాలులు వీస్తే మామిడికాయలు రాలే ప్రమాదమున్నందున రైతులు, కౌలుదారుల్లో ఆందోళన నెలకొంది.

1.20 కేజీల గంజాయి స్వాధీనం

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరి క్రాస్‌లో బైక్‌పై తరలిస్తున్న 1.20 కేజీల గంజాయిని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం ఆర్.కే.బజార్‌కు చెందిన ఎండీ.అబ్దుల్ ఫైసల్, బల్లేపల్లికి చెందిన ఎస్.కే.జమాల్, ఎస్.కే.సమీర్, ప్రకాష్‌నగర్‌కు చెందిన నల్లగట్ల దీపక్ ఖమ్మం నుండి ముదిగొండ వైపు ఒకే బైక్‌పై వెళ్తుండగా పోలీసులు తనిఖీచేశారు. వీరి వద్ద గంజాయి లభించడంతో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

పది.. పరీక్షలు ముగిసాయోచ్!



ఖమ్మంలోని ఓ కేంద్రం వద్ద పరీక్షలు ముగిసిన ఆనందంలో విద్యార్థినులు

ఖమ్మంసహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు బుధవారం ముగిశాయి. చివరి రోజు సాంఘికశాస్త్రం పరీక్ష నిర్వహించగా, 16,417 మంది విద్యార్థుల్లో 16,383 మంది హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. జిల్లా స్థాయి పరిశీలకులు నాలుగు సెంటర్లు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఒక సెంటర్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో 39 సెంటర్లతో పాటుతాను ఏడు సెంటర్లలో తనిఖీ చేశామని డీఈఓ వెల్లడించారు. కాగా, చివరి పరీక్ష రాసి సెంటర్ల నుంచి బయటకు రాగానే విద్యార్థులు స్నేహితులతో ఆనందాన్ని పంచుకున్నారు. హాస్టళ్లలో ఉంటున్న వారిని తల్లిదండ్రులు, బంధువులు లగేజీతో సహా స్వగ్రామాలకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మిత్రులకు భారంగా వీడ్కోలు పలుకుతూ సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది.

– ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్



సత్తుపల్లి టౌన్ : కేక్ కట్ చేస్తున్న విద్యార్థినులు



ఖమ్మం నుంచి విద్యార్థినులను తీసుకెళ్తున్న బంధువు



స్నేహితుల ఆత్మీయ ఆలింగనం

నెలాఖరులోగా ప్లాస్టిక్ రహితం



పాపన్న గౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు, బీసీ సంఘాల నాయకులు

- అన్ని మండల కార్యాలయాల్లో అమలు
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంసహకారనగర్: ఈ నెలాఖరు నాటికి అన్ని మండల కార్యాలయాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ప్లాస్టిక్ నియంత్రణపై సమీక్షించారు. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని, ఏప్రిల్ తర్వాత ఎక్కడా ప్లాస్టిక్ వస్తువులు వాడొద్దని తెలిపారు. అలాగే, కార్యాలయాల వద్ద చలివేంద్రాల నిర్వహణను పర్యవేక్షించాలని, గ్రామాలు, మున్సిపాలిటీల్లోని బస్టాప్‌లు, ఆటో స్టాండ్ల వద్ద తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. డీఆర్డీఓ సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ నవీన్‌బాబు, బీసీ, గిరిజన, మైనార్టీ సంక్షేమ అధికారులు జ్యోతి, విజయలక్ష్మి, డాక్టర్ బి.పురంధర్, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గౌడ్‌కు నివాళి

ఖమ్మంమయూరిసెంటర్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి, కలెక్టరేట్ ఏఓ అరుణ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, గౌడ సంఘం నాయకులు మిత్ర గౌడ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక స్వావలంబన అవసరం

ఖమ్మంమయూరిసెంటర్: మహిళల ఆర్థిక స్వావలంబన కోసం మంజూరు చేస్తున్న యూనిట్లలో నాణ్యత పాటిస్తూ వ్యాపారాలు విస్తరించుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్ బస్టాప్ వద్ద ఇందిరా మహిళా శక్తి స్త్రీ టీ స్టాల్‌ను పరిశీలంచిన ఆయన నిర్వాహకురాలితో మాట్లాడారు. వేసవి దృష్ట్యా బటర్ మిల్క్, పండ్ల రసాలు, లస్సీ అమ్మకాలపై దృష్టి సారించాలని సూచించిన ఆయన ఆమె వినతితో టీ తాగారు.

మహనీయుల జయంతి వేడుకలు

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో సూచించారు. ఈనెల 5న జగ్జీవన్ రామ్, 14న అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తొలిరోజే జగడం

పందిళ్లపల్లి రేక్ పాయింట్ వద్ద హమాలీల ఆందోళన



రేక్ పాయింట్ వద జీఆర్పీ, వైరా సీఐలు అంజలి, సాగర్

చింతకాని: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ఉన్న రైల్వే వ్యాగన్ పాయింట్‌ను మూడో లైన్ నిర్మాణ పనుల కారణంగా చింతకాని మండలం పందిళ్లపల్లి స్టేషన్‌కు తరలించారు. ఈ నిర్ణయం తీసుకున్న నాటి నుంచే ఖమ్మంలో పనిచేసిన హమాలీలు, పందిళ్లపల్లి చుట్టుపక్కల గ్రామాల హమాలీల నడుమ వివాదం మొదలైంది. పాతవారికే పని కల్పించాలని కొందరు, స్థానికులకు అవకాశం కల్పించాలని ఇంకొందరు పట్టుబడుతుండడంతో అధికారులు సర్దిచెబుతూ వచ్చారు. ఇంతలోనే తొలిసారిగా బుధవారం పందిళ్లపల్లి రేక్ పాయింట్ నుంచి మొక్కజొన్నల తరలింపునకు రైల్వే వ్యాగన్ వచ్చింది. దీంతో ఖమ్మంలో పనిచేసిన హమాలీలు 130మందితో పాటు స్థానికులు 400 మంది చేరుకున్నారు. హమాలీల నడుమ పలుమార్లు చర్చలు జరిగినా ఫలితం లేకపోవడంతో జీఆర్పీ సీఐ అంజలి, వైరా సీఐ సాగర్ సిబ్బందితో చేరుకకున్నారు. ఇరువర్గాలతో చర్చించి ఖమ్మంలో పనిచేసిన 130 మంది, స్థానిక హమాలీలు 180మంది చెరో సగం వ్యాగన్లకు మొక్కజొన్నలు లోడ్‌చేయాలని సూచించగా వివాదం సద్దుమణిగింది. ఈమేరకు లోడింగ్ పూర్తయ్యేవరకు బందోబస్తు ఏర్పాటు చేశారు. జీఆర్పీ ఏఎస్సై రఘురాం, చింతకాని ఏఎస్సై లక్ష్మణ్ చౌదరి, పోలీసులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ప్రజల్లోకి 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్'

రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రంగారెడ్డి



నేలకొండపల్లి : యాత్రలో పాల్గొన్న రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంవన్‌టౌన్/నేలకొండపల్లి: దేశ ఉజ్వల భవిష్యత్ కోసం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, సంవిధాన్ కోఆర్డినేటర్ మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. ఖమ్మం 18వ డివిజన్‌తో పాటు నేలకొండపల్లిలో నిర్వహించిన సంవిధాన్ యాత్రలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు అహంకారపూరితమని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి తీరుతో పాటు రాజ్యాంగాన్ని మార్చాలని చేస్తున్న కుట్రలను ప్రజలకు ఈ యాత్ర తెలియజేయాలని సూచించారు. అంతేకాక రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్లు లక్ష్మీమనోహర్, చామకూరి వెంకటనారాయణ, పాకాలపాటి విజయనిర్మల, మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, మహ్మద్ ఖాదర్, శేషగిరి, గజ్జెల్లి వెంకన్న, పాలకుర్తి నాగేశ్వరరావు, బాణాల లక్ష్మణ్, ప్రతిభారెడ్డి, మదూరి సైదారావు, భద్రయ్య, కొడాలి గోవిందరావు, బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, వెంకన్న, కడియాల నరేష్, గుండా బ్రహ్మం, లక్కం ఏడుకొండలు, మైశా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ప్రమాదంపై విచారణ

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని ప్రసూన ఆస్పత్రిలో లిఫ్ట్ తీగ తెగి పడగా చికిత్స కోసం వచ్చిన వనంవారి కిష్టాపురానికి చెందిన సరోజనమ్మ మృతి చెందిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. కొద్ది రోజుల క్రితం ఈ ప్రమాదం జరగగా బుధవారం ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ ఆధ్వర్యాన వివరాలు ఆరా తీశారు. లిఫ్ట్ పనితీరును పరిశీలించిన వారు.. కేఎంసీ, ఫైర్ సేఫ్టీతో పాటు ఇతర శాఖల అనుమతి పత్రాలు అందించాలని యాజమాన్యానికి సూచించారు.

శ్రీవారి పాదాలకు అష్టోత్తర కలశాభిషేకం



శ్రీవారి పాదానికి కలశాభిషేకం చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నాలుగో రోజైన బుధవారం శ్రీవారి పాదాలకు అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించిన అర్చకులు, ఆతర్వాత స్వామి, అమ్మవార్లను అలంకరించి పల్లకీ సేవ చేశారు. అనంతరం స్వామిని గజ వాహనంపై గిరిప్రదక్షిణ చేయించగా పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 4న జరిగే కల్యాణానికి హాజరుకావాలని ఖమ్మంలో కలెక్టర్ ముజ్మిమిల్‌ఖాన్‌కు ఈఓ కె.జగన్మోహన్‌రావు ఆహ్వాన పత్రిక అందజేశారు.

అన్నం ఫౌండేషన్‌కు ఎన్పీడీసీఎల్ చేయూత

ఖమ్మంవ్యవసాయం: సమాజంలో వెలుగు నింపేందుకు శ్రమిస్తున్న విద్యుత్ ఉద్యోగులు సామాజిక సేవలోనూ తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. ఇందుకోసం ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచనలతో ట్రస్టు ఏర్పాటు చేయగా, ప్రతీ ఉద్యోగి వేతనం రాగానే రూ.20 మొదలు ఎంతైనా జమ చేయాలని సూచించారు. ఈ నగదుతో ప్రతీనెల ఎక్కడిక్కడ జిల్లాల్లో సేవా కార్యక్రమాలకు అందిస్తున్నారు. ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌కు ప్రతీనెల రూ.20వేలు అందించాలని నిర్ణయించిన నేపథ్యాన ఏప్రిల్ నెలకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా జమ చేసినట్లు ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు.

12ఏళ్ల తర్వాత కుటుంబం చెంతకు..

మహిళను స్వగ్రామానికి చేర్చిన 'అన్నం'



పోలీసుల సమక్షాన గౌరమ్మను కుటుంబీకులకు అప్పగించిన శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: గత 12ఏళ్ల క్రితం కుటుంబానికి దూరమైన వృద్ధురాలిని చేరదీసి చికిత్స చేయించిన ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్ బాధ్యులు ఆమె కోలుకున్నాక కుటుంబం చెంతకు చేర్చారు. వివరాలిలా ఉన్నాయి. గత ఫిబ్రవరిలో ఖమ్మం పాత బస్టాండ్ పరిసరాల్లో 50 ఏళ్ల మతిస్థిమితం లేని వృద్ధురాలు భిక్షాటన చేస్తుందనే సమాచారంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆమెకు ఆశ్రయం కల్పిస్తూనే చికిత్స చేయించారు. దీంతో ఇటీవల కోలుకున్న ఆమె తన పేరు గౌరమ్మ అని, స్వస్థలం ఏపీలోని కర్నూలు జిల్లా ఆలూరు మండలం పెద్ద హోత్తూరు గ్రామమని, భర్త పేరు నరసింహగా వెల్లడించింది. ఈ సమాచారం ఆధారంగా అక్కడి పోలీసులకు, వారి ద్వారా కుటుంబానికి తెలపగా గౌరమ్మ ఫొటోను చూసిన ఆమె తమ్ముడు ప్రసాద్ 12 ఏళ్ల క్రితం తమ సోదరి కనిపించకుండా పోయిందని, ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదని తెలిపారు. దీంతో ఆమెను అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావును ఖమ్మం నుండి వాహనంలో పెద్ద హోత్తురు తీసుకెళ్లి అలూరు సీఐ రాజు వెంకటేష్ సమక్షాన కుటుంబానికి అప్పగించారు. ఈమేరకు గౌరమ్మను అక్కున చేర్చుకున్న వారు శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

భగవద్గీత పోటీల్లో బంగారు పతకాలు



పతకాలతో సామ్రాజ్యం, ఉమలత

చింతకాని/కల్లూరు: చింతకాని మండలంలోని బస్వాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు డి.ఉమలత, కల్లూరుకు చెందిన ధరావత్ సామ్రాజ్యం భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు గెలుచుకున్నారు. గణపతి సచ్చిదానంద స్వామి దత్తపీఠం ఆధ్వర్యాన గత నెల 21న జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా భగవద్గీతలోని 18అధ్యాయాలు, 700 శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించగా వీరు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో బుధవారం గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్నారు.

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దు

ఖమ్మంవైద్యవిభాగం: విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాల బారిన పడకుండా కాపాడుకోవాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణీందర్ సూచించారు. ఖమ్మంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో బుధవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నకిలీ యాప్‌లు, వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఈ మెయిల్, ఫేస్ బుక్ ఖాతాలతో పాటు బెట్టింగ్ గేమ్‌ల ద్వారా నగదు మోసాలకు పాల్పడే అవకాశముందని తెలిపారు. ఈమేరకు గుర్తు తెలియని సైట్లు, వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930కు ఫోన్ చేయడం లేదా www. cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని డీఎస్పీ తెలిపారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, డాక్టర్ సరితతో పాటు సైబర్ క్రైమ్ ఎస్సై రంజిత్‌కుమార్, ఉద్యోగులు ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన గూడ్స్ రైలు

గేట్ల వద్ద వాహనదారుల ఇక్కట్లు

కారేపల్లి: సిగ్నళ్లలో సాంకేతిక లోపం తలెత్తడంతో.. కారేపల్లిలోని ఇల్లెందు, పేరుపల్లి రైల్వే గేట్ల వద్ద గూడ్స్‌రైలు నిలిచిపోయిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. కొత్తగూడెం నుంచి కారేపల్లి రైల్వే జంక్షన్ మీదుగా డోర్నకల్ వైపు బొగ్గులోడుతో వెళ్తున్న గూడ్స్ రైలు ఇల్లెందు(2కేకే) రైల్వే గేట్, పేరుపల్లి(1కేకే) రైల్వే గేట్ల వద్ద సిగ్నల్ సాంకేతిక లోపం కారణంగా నిలిచిపోయింది. దీంతో రెండు గేట్లు తెరుచుకోకపోవటంతో సుమారు గంట పాటు ఇరువైపులా వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. విపరీతమైన ఎండ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా, ఈ రెండు రైల్వే గేట్లకు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి లేదా అండర్ బ్రిడ్జిలను నిర్మించాలని ప్రజాప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదని వాహనదారులు, స్థానికులు వాపోయారు.

తాటిచెట్టు పైనుండి పడి గీతకార్మికుడు మృతి

కొణిజర్ల: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుండి పడిన గీతకార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని కొండవనమలలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన తీగల సత్యం(57) మంగళవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కే క్రమాన కింద పడ్డాడు. దీంతో ఆయనను ఆయనను 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై సత్యం భార్య స్వరూప ఫిర్యాదుతో బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

మున్నేటిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ముదిగొండ: మండలంలోని వల్లాపురంలో మున్నేటిలో గుర్తుతెలియని వ్యక్తి (32) మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. ఈ సందర్భంగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకుని పరిశీలించారు. సదరు వ్యక్తి నేవీ బ్లూ కలర్ ప్యాంట్, నలుపు రంగు చొక్కా ధరించి ఉన్నాడని, ఆయన ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని ముదిగొండ సీఐ మురళి సూచించారు. కాగా, మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్‌కు నివాళి



వైరారూరల్ : కృష్ణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సై భాగ్యరాజ్, సిబ్బంది

ఖమ్మంక్రైం/వైరా రూరల్: నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ మంగళవారం రాత్రి ఖమ్మంలో ఆత్మహత్య చేసుకున్న బండి కృష్ణ మృతదేహం వద్ద పోలీసు ఉద్యోగులు నివాళులర్పించారు. పోలీస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, నేలకొండపల్లి, వైరా ఎస్సైలు సంతోష్, ఏవీకే.భాగ్యరాజ్ తదితరులు నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం కృష్ణ మృతదేహాన్ని స్వగ్రామమైన వైరా మండలం రెబ్బవరం తరలించగా 2009బ్యాచ్ కానిస్టేబుళ్లు మాతంగి విజయ్, భూక్యా బాల్యా, కొలికపాక రంగారావు తదితరులు నివాళులర్పించి దహన సంస్కారాలకు రూ.10 వేల నగదు అందజేశారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ బుధవారం తీర్పు చెప్పారు. ఖమ్మం బుర్హాన్‌పురానికి చెందిన బత్తినేని రేణుక వద్ద రాపర్తినగర్‌కు చెందిన వెడగొట్టు హన్మంతు 2018 జూలైలో రూ.4లక్షల అప్పు తీసుకున్నాడు. తిరిగి 2019 ఫిబ్రవరిలో రూ.4.50లక్షలకు చెక్కు జారీ చేసినా ఆయన ఖాతాలో నగదు లేక తిరస్కరణ గురైంది. దీంతో రేణుక తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. ఈఈ కేసు విచారణ అనంతరం హన్మంతుకు ఆరు నెలల శిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.4.50లక్షలు చెల్లించాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు.